క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 18, బెండ 28, పచ్చిమిర్చి 28, కాకర 20, బీర 23, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 28, దొండ 18, చిక్కుడు 45, గోకర 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 30, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 28, చామగడ్డ 35. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

'కామినేని'లో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కామరాజ్ తెలిపారు. ఈ నెల 11న ప్రారంభమైన ఈ శిబిరం 16వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎముకలు, కీళ్ల వ్యాధులతో బాధపడేవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నోటరీ ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

సైదాబాద్: నోటరీ పత్రాలు ఉన్నవారు తమ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ కోరారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల ప్రకారం జీఓ ఎంఎస్ 84 ప్రకారం నోటరీ పత్రాలు ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అర్హులైన వారు తమ వద్ద ఉన్న నోటరీ పత్రాలతో పాటు, కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ఆధార్ కార్డు వంటి డాక్యుమెంట్లతో మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీ సేవ రసీదుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను జత చేసి తమ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. సైదాబాద్ మండల పరిధిలో అర్హులైన వారు జీఓ 84ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయశ్రీ సూచించారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం పంజేషాహలోని కార్యాలయంలో లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చార్మినార్, అంబర్‌పేట మండలాల పరిధిలోని కాలడేరాకాలనీ, ఆజంపురా, అక్బర్‌బాగ్, శంకర్‌నగర్, వాహేద్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట, ఫర్హత్‌నగర్, ఉస్మాన్‌పుర, చంచల్‌గూడ, చావుని ప్రాంతాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ. 62,07,192 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చార్మినార్ తహసీల్దార్ నీహారిక, ఆర్‌ఐ రిజ్వాన్, అంబర్‌పేట ఆర్‌ఐ శ్రీకాంత్, మజ్లిస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



భూపాల్‌రెడ్డి, అధ్యక్షుడు



ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ ఫేజ్–1 కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా తూము భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతాపురం ప్రభాకర్‌రెడ్డి , కోశాధికారిగా కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.ప్రభాకర్ రెడ్డి, ఎ.రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లోకేశ్వర్‌రెడ్డిని కాలనీవాసుల ఎన్నుకున్నారు. అలాగే, సలహాదారులుగా ప్రభాకర్‌రెడ్డి, ఎస్. బాలేశ్వర్‌రావు, ఏవీ ప్రభాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, పుల్లయ్యను ఎన్నుకున్నారు.

'ఇళ్లు కేటాయించకపోతే మా ప్రతాపం చూపిస్తాం'

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని అర్హులైన ఎరుకల కులస్తులకు డబుల్ ఇళ్లు కేటాయించకపోతే రానున్న ఎన్నికల్లో ప్రతాపం చూపిస్తామని ఎరుకల సంఘం నేత జగన్నాథం గంగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమకు ఇళ్లు కేటాయించాలని రెండు వారాలుగా నాగోలు డివిజన్ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల సముదాయాల వద్ద నిరసన దీక్ష చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎరుకల కుల వృత్తిలో ఉపయోగించే వస్తువులతో దీక్ష శిబిరంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాపమ్మ, అంజి, విజయ్, నాగమ్మ, కుమారి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై పెద్ద గొయ్యి!

- రాత్రి సమయంలో ఏర్పడ్డ వైనం
- త్రుటిలో తప్పిన ముప్పు
- తక్షణ మరమ్మతులకు ఎమ్మెల్యే ఆదేశం



కుంగిన రోడ్డును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: అది నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు.. రాత్రి ఒక్కసారిగా కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారుడు అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. హయత్‌నగర్ నుంచి తొర్రూర్ వైపు వెళ్లే హయత్‌నగర్ పాత రోడ్డుపై సోమవారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో ఒక ద్విచక్రవాహనం వెళ్తుండగా రోడ్డు కుంగింది. ఇది గమనించిన వాహనదారుడు వేగంగా ముందుకు వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. కొద్ది సేపట్లోనే రోడ్డు కూలిపోయి గొయ్యి ఏర్పడింది. స్థానికులు ఇతర వాహనదారులను అప్రమత్తం చేసి ఆ రోడ్డుపై వెళ్లకుండా చేశారు. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ప్రమాద స్థలానికి పిలిపించి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. రాక పోకలను నిలిపివేయడంతో మంగళవారం ఉదయం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డును మూసివేయడంతో వాహనదారులకు దిక్కతోచక హయత్‌నగర్ పాత గ్రామంలో నుంచి వెళ్లారు. వాహనాలు పెద్ద ఎత్తున కాలనీ అంతర్గత రోడ్ల సందుల నుంచి రావడంతో ఏం జరిగింతో తెలియక స్థానికులు అయోమయానికి గురయ్యారు.

వెంటనే మరమ్మతులు చేయండి: ఎమ్మెల్యే

రోడ్డు కృంగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గొయ్యి ఏర్పడిన చోట రోడ్డు కింద ఉన్న నీటి పైపులు ధ్వంసమయ్యాయని, వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, రోడ్డు కృంగి పోయిన చోట చాంబర్‌ను ఏర్పాటు చేసి త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా ఎందుకు జరిగిందంటే..

హయత్‌నగర్ నుంచి తొర్రూర్ వైపు వెళ్లే హయత్‌నగర్ పాత రోడ్డు అడుగు భాగంలో వనస్థలిపురం నుంచి కుంట్లూరు వరకు సుమారు 7 కిలో మీటర్ల దూరం సీవరేజీ ట్రంకన్ లైన్ ఉంది. టంక్రన్ లైన్ నిర్మించినప్పుడు మ్యాన్‌హోళ్లు రోడ్డుకు సమాంతరంగా ఉండేవి. అయితే, ఆ రోడ్డుపై మళ్లీ.. మళ్లీ రోడ్డు వేయడంతో మ్యాన్‌హోళ్లు దాని అడుగుకు వెళ్లిపోయాయి. జలమండలి సిబ్బందికి మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసేందుకు ఆస్కారం లేకపోవడంతో ట్రంకన్ లైన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు సాఫీగా ముందుకు వెళ్లడం లేదు. దీంతో ఆ నీటి ఒత్తిడికి బలహీనంగా ఉన్న మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు పొంగి భూమి పొరల్లోకి చేరుతోంది. దీనిని ఎవ్వరూ గుర్తించలేదు. ఆ నీరు ఇటీవల హయత్‌నగర్ పాత రోడ్డులో కొన్ని చోట్లపైకి వచ్చింది. వర్షాలు కురుస్తుండటంతో స్థానికులు దానిని వాన నీరుగా భావించారు. ఇదే ప్రాంతంలో సోమవారం రాత్రి రోడ్డు కూలిపోయి పెద్దగొయ్యి ఏర్పడింది. ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతానికి కొంత దూరంలో మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో రోడ్డు కుంగిపోయింది. రోడ్డు ఎత్తుగా ఉండటంతో ప్రస్తుతం జలమండలి అధికారులకు సీవరేజీ ట్రంకన్ లైన్ మ్యాన్‌హోళ్లను గుర్తించడం పెద్ద సమస్యగా మారింది.

బీఆర్‌ఎస్ పాలనలో యువతకు ఉపాధి ఏదీ: బీజేపీ



ఆర్‌కేపురంలో పాదయాత్ర చేస్తున్న శ్రీరాములు, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: డ్రగ్స్, మద్యంతో యువత, కుటుంబాలను సర్వ నాశనం చేస్తున్న బీఆర్‌ఎస్ సర్కార్‌కు గుడ్ బై చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురంలో కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకూ బీజేపీ కార్యక్రమం మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని గ్రీన్ హిల్స్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ, నియోజకవర్గంలో గల్లీకో బెల్ట్ షాపు, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్ముతున్నా మంత్రి సబితారెడ్డి సహా ప్రభుత్వ యంత్రాంగం కళ్లు మూసుకుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలు, ఉపాధి, నిరుద్యోగ భృతిలేక యువత ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, సిద్దూ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

నాగోలు: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నాగోలు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నాగోలు అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.మండపాల నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలగని విధంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లకు అనుమతి ఉందన్నారు. నిమజ్జన శోభయాత్రను సాయంత్రంలోపే ముగించాలని, డీజేలకు అనుమతి లేదని వివరించారు. కార్యక్రమంలో నాగోలు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు శ్రీనివాస్, మధు, ఇతర సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చాదర్‌ఘాట్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజున్నీసా అన్నారు. మంగళవారం ఓల్డ్‌మలక్‌పేటలోని యూపీహెచ్‌సీలో స్థానిక ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్‌తో కలిసి ఆరోగ్య మహిళ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి మంగళవారం యూపీహెచ్‌సీ సెంటర్‌లో మహిళల కోసం ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వ గురువుగా నిలిపేందుకు ప్రధాని కృషి



మేరా మిట్టీ- మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న కె.లక్ష్మణ్, రంగారెడ్డి

నాగోలు: దేశాన్ని విశ్వ గురువుగా నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె, లక్ష్మణ్ అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ బీజేపీ (మేరా మిట్టీ–మేరా దేశ్) కార్యక్రమంలో లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులను గజమాలతో సత్కరించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రతీ ఇంటి నుంచి పిడికెడు మట్టి లేదా పిడికెడు బియ్యం సేకరించి ఢిల్లీకి అమృత్ వనం ఏర్పాటుకు పంపుతామన్నారు. స్మృతివనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతీ భారతీయుడు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ నేతలు ప్రధాని మోదీని కొనియాడుతుంటే.. మన ప్రతిపక్షాలు జీర్ణంచుకోలేకపోతున్నాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో తమ కుటుంబాల అభివృద్ధి కోసమే కొందరు నాయకులు ఆరాట పడుతున్నారని విమర్శించారు. నా కంటే పెద్ద హిందూ ఎవ్వడూ లేడని చెప్పుకొనే కేసీఆర్‌కు ఈ రోజు సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులు కనపడటం లేదా అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్, గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, సిద్దాల ఐలయ్య, నరేందర్‌రెడ్డి, బద్దం బాలకృష్ణగౌడ్, డప్పు రాజు, రాజేష్, వస్పరి మల్లేష్, పద్మరెడ్డి పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయానికి రూ.25 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–2లో నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి మంగళవారం రూ.25 వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్, హరి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

దిల్‌సుఖ్‌నగర్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమైక్య ఆధ్వర్యంలో కొత్తపేటలోని వాసవి భవన్‌లో ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మోదీజీ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మంగళవారం వాసవీ ఆలయంలో పూజలు చేశారు. మోదీ పేరు మీద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థికి స్కూల్ ఫీజు కోసం రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కల్పన, పద్మ, వీణ, ఆర్. పద్మ, సంతోషి, రమాదేవి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవాలు



మన్సూరాబాద్: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాన్ని నిర్వహించారు. మన్సూరాబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆకు కూరలు, పాలు, పండ్లు, కూరగాయలే కాకుండా చిరుధాన్యాలు, రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలతో తయారు చేసిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమతి, ఆయా శోభ, గర్భిణులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు

మన్సూరాబాద్: దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్ధార్థ జూనియర్, డిగ్రీ మహిళా కాలేజీల ఫ్రెషర్స్ డే బ్లూసోమ్స్ 2023 వేడుకలు మన్సూరాబాద్ చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ కళాశాలల చైర్మన్ డాక్టర్ జి.నాగయ్య హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల జీవితం మరిచిపోలేనిదని, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు గోవర్ధని, త్రివేణి కాంచన, సల్మాసుల్తానా, డైరెక్టర్లు మోహన్‌రావు, రాంరెడ్డి, వంశీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల రక్షణే ట్రాఫిక్ పోలీసుల లక్ష్యం

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేట: ప్రజల రక్షణే ట్రాఫిక్ పోలీసుల లక్ష్యమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మూసారంబాగ్ అవంతి డిగ్రీ కాలేజీలో మంగళవారం ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సేఫ్టీ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో వెళ్లడం,సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్ వంటివి చేయరాదన్నారు. స్టాప్‌లైన్, జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలను నిలపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, ఇతర వాహనదారులకు ఆటంకం కలగకుండా డ్రైవింగ్ చేయాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి పోలీసులకు పట్టుబడితే కౌన్సిలింగ్ ఇస్తారని, ప్రమాదానికి గురైతే ప్రాణాలకే ముప్పు వస్తుందని, అందువల్ల తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ అనుగుణంగా నడుచుకోవాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండటం మంచిదన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది శ్రీధర్, కృష్ణ, సుధాకర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించేది సనాతన ధర్మం: సంరెడ్డి



నిరసన దీక్షలో పాల్గొన్న సురేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అన్ని మతాలను సమదృష్టితో గౌరవించేది సనాతన ధర్మమం ఒక్కటేనని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ హనుమాన్ టెంపుల్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు ఆయనతో పాటు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, సీనియర్ నేత నర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఉదయనిధి స్టాలిన్ ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం వల్లే అన్ని మతాలు స్వేచ్ఛగా జీవిస్తున్నాయని, సర్వ మానవాళి సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల దినేష్, వై.సురేందర్, కొంగర ప్రవీణ్, రంజిత్‌కుమార్, లక్ష్మారెడ్డి, నవీన్‌గుప్తా, శ్రీనివాస్, చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయండి

సైదాబాద్: యువకుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు తూట్లు పొడుస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన నిరాహార దీక్షను జిల్లా పరిధిలోని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద బుధవారం ఉదయం 10 నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు దీక్ష కొనసాగుతుందన్నారు.

ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

మలక్‌పేట: మూసారంబాగ్‌కు మంగళవారం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ్ ప్రతాప్‌రెడ్డిని శాలివాహన వాకర్ క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతతో సన్మానించి శుభాకాంక్షలు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెల్లారి రఘునందన్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు, వెంకట్రావు, జెక్కా మోహన్ రెడ్డి, పున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్, రాజేశ్వర్, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, గంగాధర్ రెడ్డి ఉన్నారు.



విజయ్ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న రఘునందన్‌రెడ్డి

ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్ వార్డెన్ బదిలీ

సైదాబాద్: మలక్‌పేట బీ–బ్లాక్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం బాలికలు చేసిన నిరసనకు అధికారులు స్పందించారు. నాణ్యమైన ఆహారం అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొన్న వార్డెన్‌ను బదిలీ చేశారు. వంటగది పనిమనుషులను సైతం అధికారులు మార్చారు. హాస్టల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న రమాదేవి స్థానంలో గతంలో ఇక్కడే పనిచేసిన సుందరి మేరిని నియమించారు. వంట మనుషులుగా చేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ని కూడా మార్చారు. మంగళవారం హాస్టల్‌ను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి సందర్శించారు. నూతనంగా వచ్చిన వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులతో అన్నారు. అంధ బాలికల వసతి గృహాన్ని తరచూ పర్యవేక్షిస్తానని బాలికలకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

మహిళలకు, విద్యార్థినులకు షీ టీమ్ భద్రత



నాగోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

నాగోలు: ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లోని మహిళా ఉద్యోగులు, బాలికలు వేధింపులకు గురి కాకుండా షీ టీమ్ భద్రత కల్పిస్తూ భరోసా ఇస్తోందని ఎల్‌బీనగర్ షీ టీమ్ ఇన్‌ఛార్జి నరసింహ అన్నారు. మంగళవారం నాగోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్‌బీనగర్ షీ టీమ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని మహిళా ఉద్యోగులకు, బాలికలకు సైబర్ క్రైమ్ నేరాలు, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మికులు, బాలలపై వేధింపులు, గుడ్‌టచ్, బాడ్‌టచ్ వంటి అంశాలపై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో పనిచేసే మహిళలు, పాఠశాలల, కళాశాల్లో చదివే బాలికలను ఆకతాయిలు వేధిస్తే 100కు డయల్ చేస్తే వెంటనే కాపాడేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నాగోలు: కొత్తపేట డివిజన్ సమస్యలను పరిష్కరించడంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా 5వ రోజు యాత్రను మంగళవారం కొత్తపేట డివిజన్‌లోని సమతాపురి కాలనీ నుంచి బాలాజీ నగర్, మోహన్ నగర్, సీటీఓ కాలనీ, కొత్తపేట ఓల్డ్ విలేజ్, సత్యానగర్ మీదుగా ఓల్డ్ మారుతి నగర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్‌ను అధోగతి పాల్జేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుకునూరు శ్రీధర్ రెడ్డి, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షులు మల్లారపు శ్రీనివాస్, యరమల రాంరెడ్డి, కొత్తపేట యువజన కాంగ్రెస్ నాయకులు లింగాల భాషా గౌడ్, మహిళ నాయకులు సంగీత తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోండి

నాగోలు: డ్రైనేజీ నీరు రోడ్లపై పారకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో మరమ్మతు పనులు చేపట్టాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. కొత్తపేట విలేజ్‌బస్తీ దవాఖానా సమీపంలో సీసీ రోడ్డు పనులు చేస్తుండగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ కూలిపోయి మురుగు నీరు నిరంతరం పారుతోంది. దీంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ విషయం తెలిసి కార్పొరేటర్.. మంగళవారం అక్కడికి వెళ్లి సమస్యను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో సంప్రదించి వారం రోజులుగా డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు కలిసి డ్రైనేజీ మాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్థానికులు గట్టు మహేష్ కుమార్, వెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

పీస్ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయం



సమావేశంలో పాల్గొన్న డీసీపీ రూపేష్

సైదాబాద్: శాంతి భద్రతల పరిరక్షణలో, పండగల వేళ ప్రశాంత వాతావరణం నెలకొల్పడంలో పీస్ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేష్ అన్నారు. మంగళవారం సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సౌత్‌ఈస్ట్ జోన్ పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ, పాతబస్తీ సహా హైదరాబాద్ నగరంలో మతసామరస్యం నెలకొల్పడంలో పీస్ కమిటీల సహకారం ఎంతో ఉందన్నారు. 30 ఏళ్ల తర్వాత ఈ సంవత్సరం మిలాద్ ఉన్ నబీ, గణేష్ నిమజ్జనం ఒకేరోజు వస్తున్నాయని, రెండు వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు పీస్ కమిటీ సభ్యులు సహకరించాలని ఆయన కోరారు. సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, డీఐలు, ఎస్‌ఐలు సిబ్బంది, 300 మందిపైగా పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.